# ఎల్ఐసి ఏజెంట్లకు వెల్ఫేర్ ఫండ్

- ఎల్ఐసిఎఒఐ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ డిమాండ్
- యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ముగిసిన రాష్ట్ర 4వ మహాసభ
- 54వ మందితో నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో మాట్లాడుతున్న మంజునాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్ఐసి ఏజెంట్లకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసిఎఒఐ) వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్, జోనల్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నర్సింహారావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎల్ఐసిఎఒఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో వారు మాట్లాడారు.

ఎల్ఐసి రక్షణ, ఏజెంట్ల పరిరక్షణ లక్ష్యంతో ఎల్ఐసిఎఒఐ 14 లక్షల మంది ఏజెంట్ల హక్కుల కోసం 23 ఏళ్లుగా పోరాడుతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల వల్ల పెరుగుతున్న దేశసంపదలో జీతాల వాటా 2019లో 18.9 శాతం ఉంటే ఇప్పుడు 15.9 శాతానికి పడిపోయిందని అన్నారు. అదే కాలంలో కంపెనీల లాభాల వాటా 38.7 శాతం నుంచి 51.9 శాతానికి పెరిగిందన్నారు. దాంతో కొద్దిమంది ప్రపంచ కుబేరులుగా ఎదిగారని తెలిపారు. 80 శాతం పైగా సామాన్య ప్రజలు పూట గడవని స్థితికి నెట్టబడుతున్నారని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉన్న ఈ 11 ఏళ్లలో రూ.16.35 లక్షల కోట్లు కార్పొరేట్ మొండి బకాయిలను బ్యాంకులు రద్దు చేశాయని తెలిపారు. ఇన్సూరెన్స్ చేయగలిగిన స్థోమత ఉన్న జనాభాలో 70 శాతానికి పాలసీలు అందించడం ద్వారా ఎల్ఐసి ఇన్సూరెన్స్ వ్యాపారాన్ని రికార్డ్‌స్థాయికి పెంచగలిగిందని తెలిపారు. 99 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్‌తో ప్రపంచంలో అగ్రగామి సంస్థగా ఎదిగిందని అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఎల్ఐసిని 100 శాతం విదేశీ పెట్టుబడులతో ఇన్సూరెన్స్ కంపెనీలను స్థాపించే వీలు కల్పిస్తూ చట్టం చేయడం అన్యాయమని చెప్పారు. ప్రధాన కార్యదర్శి తన్నీరు కుమార్ మాట్లాడుతూ.. మార్కెట్ పోటీని తట్టుకొని సమర్థవంతంగా ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం కోసం నాలుగు సాధారణ బీమా కంపెనీను విలీనం చేయాలనే ఉద్యోగుల డిమాండ్‌ను కేంద్రం పెడచెవిన పెడుతుందని అన్నారు. జీవితబీమా, సాధారణ బీమా వ్యాపారం ఒకే కంపెనీ చేసుకోవడానికి వీలు కల్పిస్తూ కాంపోజిట్ లైసెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసి ఏజెంట్లకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రొఫెషనల్ ట్యాక్స్ రద్దు చేయాలనే వంటి డిమాండ్లను మహాసభ తీర్మానించింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు.

**54 మందితో నూతన రాష్ట్ర కమిటీ...**

మహాసభ అనంతరం 54 మందితో నూతన కమిటీ ఏర్పడింది. గౌరవాధ్యక్షులుగా జె.వెంకటేష్, అధ్యక్షులుగా తాళ్ళూరి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తపల్లి రామనరసయ్య, ప్రధాన కార్యదర్శిగా తన్నీర్‌కుమార్, కోశాధికారి జి.ఆధిత్య, ఉపాధ్యక్షులుగా పాలమాకుల రాజబాబురెడ్డి, కమటం స్వామి, సంగెం వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా పడిదం కట్టస్వామి, ఉలిపె రవికుమార్, ఆమందు రాజ్‌కుమార్, సోయం జోగారావు, ఎం.అరుణ ఎన్నికయ్యారు.

## పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ

- మహిళలకు సిఎం రేవంత్‌రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అక్కాచెల్లెళ్లందరికీ ఆయన సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తీరొక్క పూలతో తయారు చేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడబిడ్డలందరూ ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని తెలిపారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతోపాటు అనేక సామాజిక అంశాలతో నిండి ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు రాష్ట్రమంతా అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి, సరూర్ నగర్ స్టేడియంలో పది వేల మంది మహిళలతో ప్రభుత్వం ఘనంగా వేడుకలను నిర్వహించిందని వివరించారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. చెరువులు, కుంటలను పదిలంగా కాపాడి భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందిస్తోందని పేర్కొన్నారు. అందుకే అంబర్‌పేట్‌లో బతుకమ్మకుంటను పునరుద్ధరించామని తెలిపారు.

## రాజ్‌భవన్‌లో ఘనంగా వేడుకలు

- మహిళలతో కలిసి ఆడిపాడిన గవర్నర్ దంపతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ అధికారిక నివాసం రాజ్‌భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన వేడుకల్లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆయన సతీమణి సుధా దేవ్ వర్మతో కలిసి బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అందంగా పేర్చిన బతుకమ్మను ఆమె స్వయంగా తీసుకు వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆమె ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని కొనియాడారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు తెలంగాణ మహిళలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్‌భవన్ సిబ్బంది తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

జోగులాంబ బాల బ్రహ్మేశ్వరులకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కొండ సురేఖ

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదవ శక్తిపీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా జోగులాంబ బాల బ్రహ్మేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, ఎమ్మెల్యేలు విజయుడుతో కలిసి మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. వారికి ఆలయ అర్చకులు, ఆలయ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి దీప్తి సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రముఖ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాగా, దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జోగులాంబ ఆలయంలో నిర్వహిస్తున్న నవ అలంకారాల్లో భాగంగా సోమవారం జోగులాంబ దేవిని మహాగౌరీ దేవిగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, గద్వాల సంస్థాన వారసులు కృష్ణా రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటి విడతలోనే పాలేరు నియోజకవర్గంలో ఎన్నికలు

- 42శాతం బిసి రిజర్వేషన్లతోనే ఎన్నికలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొదటి విడతలోనే పాలేరు నియోజకవర్గంలోని ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలు జరగనున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మండలాల వారీగా పార్టీ పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా కాంగ్రెస్ పార్టీ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల జిఒ జారీ చేసి ఎన్నికలకు సిద్ధమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీఓను కొందరు హైకోర్టులో సవాలు చేశారని, అక్టోబర్ 8న హైకోర్టు తీర్పు వెలువడనున్నదని తెలిపారు. ఆ తీర్పును స్వాగతిస్తూ... కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో విభేదాలు ఉన్నా వాటిని చర్చల ద్వారా పరిష్కరించి ఐక్యతతో ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత కోసం ప్రతి మండలానికి తొమ్మిది మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఒకే గ్రామం నుంచి అనేక మంది ఆశావహులు ఉన్నప్పుడు గెలుపు అవకాశాలు, పార్టీపై విధేయతను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థులను ఖరారు చేస్తామని అన్నారు. రిజర్వేషన్ల కారణంగా పోటీకి దూరమైన వారికి వేరే అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## తెలంగాణ సంస్కృతి మణిమాలిక బతుకమ్మ

- తెలుగు వర్సిటీ విసి నిత్యానందరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సంస్కృతి మణిమాలిక బతుకమ్మ అని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (ఎస్‌పిటియు) విసి నిత్యానందరావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని వర్సిటీ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

## భారత క్రికెట్ టీమ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చివరి వరకు ఉత్కంఠ రేపిందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అద్భుత విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించి అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో తెలంగాణకు గొప్ప పేరు, గౌరవం తెచ్చిన తిలక్‌వర్మకు అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యేలతో ముగిసిన మొదటిరోజు విచారణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో మొదటిరోజు విచారణ ముగిసింది. సోమవారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో ఉదయం 11 గంటల నుంచి విచారణ కొనసాగింది. పిటిషనర్లు కల్వకుంట్ల సంజయ్, చింతాప్రభాకర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరుపున న్యాయవాదులు తమ వాదనలను వినిపించారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తరుపు న్యాయవాదులు తమ అభిప్రాయాలను తెలిపారు. అనంతరం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం బహిరంగ రహస్యమేనన్నారు. తమ ఫిర్యాదుతో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వివరణ ఇచ్చారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ విచారణ చేపట్టారన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సిగ్గుంటే తమ పదవికి రాజీనామా చేయాలని కోరారు. మీడియాలో వచ్చిన వార్తలను స్పీకర్‌కు ఇచ్చామన్నారు. పార్టీ మారినట్టు రుజువు చేసేందుకు తమ వద్ద కావాల్సిన అన్ని ఆధారాలూ ఉన్నట్టు తెలిపారు.

## అక్టోబర్ ఒకటి నుంచి పత్తి కొనుగోలుకు చర్యలు తీసుకోండి

- కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు మంత్రి తుమ్మల లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి పంట చేతికొస్తుందని, అక్టోబర్ ఒకటి నుంచి పత్తి కొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు మంత్రి లేఖ రాశారు. రాష్ట్రంలో 43.29 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని తెలిపారు. సుమారు 24.70 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో సిసిఐ రెండుసార్లు టెండర్లు పిలిచినా, కొన్ని కొత్త నిబంధనల కారణంగా జిన్నింగ్ మిల్లర్లు టెండర్లలో పాల్గొనడం లేదని వివరించారు. దాంతో పత్తి కొనుగోలు నిలిచిపోవడమే కాకుండా రైతులు కూడా తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్1, ఎల్2 అలాట్మెంట్లు, లింట్ రికవరీ శాతం, ఫోర్ట్‌నైట్ వారీగా, జోన్ల వారీ లింట్ శాతం నిర్ణయం, రైతుల స్లాట్ బుకింగ్, ఏరియా మ్యాపింగ్ తదితరాంశాలపై రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. తేమ శాతం, నాణ్యత, తూకం, ధరల విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పర్యవేక్షించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పత్తి ధర క్వింటాల్‌కు మార్కెట్‌లో రూ.6,700 మాత్రమే ఉందని, దాన్ని రూ. 8,110 చేయాలని మంత్రి లేఖలో పేర్కొన్నారు.

# గత ప్రభుత్వ తప్పులన్నీ సరిచేస్తున్నాం

- వందల మందికి ఉద్యోగాలిచ్చి ప్రజా ప్రభుత్వం రికార్డు సృష్టించింది
- రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్లు భట్టి విక్రమార్క

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వం చేసిన తప్పులన్నీ సరిచేస్తున్నామని, తక్కువ కాలంలో వందల మందికి గ్రూప్ -1 ఉద్యోగాలు ఇచ్చి ప్రజా ప్రభుత్వం రికార్డు సృష్టించిందని, ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నారాయణపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం రాత్రి డిప్యూటీ సిఎం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కసారి కూడా గ్రూప్-1 ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. పారిశుధ్య కార్మికులు, పంచర్లు వేసుకునే వారి బిడ్డలు, పేద రైతులు, రోజువారి కూలీల బిడ్డలు కష్టపడి చదివి ఉద్యోగాలు సంపాదిస్తే వారి కష్టాన్ని అవహేళన చేసే విధంగా కొద్దిమంది మాట్లాడటం బాధాకరంగా ఉందని తెలిపారు. చేసిన పనులు చెప్పుకునే సంప్రదాయం కాంగ్రెస్ ప్రభుత్వాలకు లేదన్నారు. కానీ కొన్ని ప్రభుత్వాలు ఏమి చేయకుండానే అన్నీ చేసినట్టు భ్రమలు కల్పించి ప్రజలను ఆ భ్రమల్లో ఉంచి అన్నీ పూర్తి చేశామని ప్రచారం చేసుకుంటారని విమర్శించారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేద కుటుంబం ఉండరాదనేది తమ ప్రభుత్వ ఆలోచన అని అన్నారు.

100 పడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని, లేదంటే పాదయాత్ర చేస్తామని మధిర పట్టణంలో ఓ పెద్దాయన ప్రకటించారని, పనులు పూర్తి చేయకుండా ఆస్పత్రిని ఎలా ప్రారంభిస్తామని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో తాను మధిరలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సభలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మధిర ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల అమలుకు ఇంతకన్న బెస్ట్ ఏముందో చెప్పండి

- చేతనైతే పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదించాలి
- బిజెపి నేతలకు మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి సవాల్

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు పొన్నం, శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఇంతకన్న బెస్ట్ ఏముందో చెప్పాలంటూ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముదిరాజ్ బిజెపి జాతీయ నాయకులను ప్రశ్నించారు. చేతనైతే రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న ఆ బిల్లుకు ఆమోదం తెలపాలని సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. బిజెపి నేతలకు బలహీన వర్గాల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ బిల్లుకు మద్దతు తెలుపాలని కోరారు. బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావు సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించడం సరైందికాదన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పార్టీ అధిష్టానాన్ని ఒప్పించి రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుందని, ఆ తర్వాత గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతి వద్దకు చేరిందని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరితో కలిసి తాను కలిసి అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలవబోతున్నట్టు తెలిపారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తు చేశారు. బిసిలకు దసరా పండుగ కంటే ముందుగానే పండుగ వచ్చిందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. బిసి రిజర్వేషన్ల కోసం రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని ప్రయత్నాలు చేశామని, ఇప్పుడు చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని తెలిపారు.

## చేతి వృత్తులకు చేదోడు.. సరస్‌మేళా

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ మహిళల చేతివృత్తులకు సరస్ మేళా చేదోడుగా నిలుస్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం హైదరాబాద్ శిల్పారామంలోని 'ఇందిరా మహిళా శక్తి బజార్'లో కొనసాగుతున్న సరస్ మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడున్న స్టాళ్లను పరిశీలించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ 'మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేళా గ్రామీణ ప్రాంతాల స్ఫూర్తికి, మార్కెటింగ్ ఇన్నోవేషన్‌కు అద్దం పడుతోందని కొనియాడారు. తెలంగాణలో మహిళా సాధికారత అనేది ఉద్యమంలా ముందుకు సాగడం సంతోషంగా ఉందని అన్నారు. గతంలో పోచంపల్లిని సందర్శించానని, అక్కడ లభించేవి కేవలం చీరలు, దుస్తులే కావు.. తెలంగాణ చరిత్ర సంస్కృతి' అని గవర్నర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఈ సందర్భంగా గవర్నర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.5కు కడుపునిండా భోజనం

- ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ క్యాంటీన్లు : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గరీబీ హటావో అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన ఇందిరమ్మ స్ఫూర్తితో ఆకలి బాధలు లేని హైదరాబాద్ లక్ష్యంగా ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి మోతీనగర్, ఖైరతాబాద్ మింట్ క్యాంపస్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను ప్రారంభించారు. లబ్ధిదారులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. పారిశుధ్య కార్మికులు, లబ్ధిదారులతో కలిసి మంత్రి, మేయర్ భోజనం చేశారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో నూతనంగా 60 వేలకు పైగా రేషన్ కార్డులను అందించామని తెలిపారు. ఇందిరమ్మ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇందిరమ్మ క్యాంటీన్లను ప్రారంభించామని, ఇప్పటి నుంచి ఇందిరమ్మ క్యాంటీన్‌లలో అల్పాహారం రూ.5కు, భోజనం రూ.5కు లభిస్తుందని, జిహెచ్ఎంసి ఒక్కో అల్పాహారంపై రూ.14, భోజనంపై రూ.24.83 వెచ్చిస్తోందని అన్నారు. ప్రతి లబ్ధిదారునికి నెలకు సగటున సుమారు రూ.3 వేల వరకు ఆర్థిక ప్రయోజనం కలగనుందని తెలిపారు. హరే కృష్ణ హరే రామ ఫౌండేషన్ వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తుందన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా ఉదయం అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో హైదరాబాద్‌లో పేదలు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అల్పాదాయ వర్గాల వారు, నిరుద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతున్నా పేదలకు నాణ్యమైన ఆహారం తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతోనే ఈ ఇందిరమ్మ క్యాంటీన్లను ప్రారంభించినట్టు చెప్పారు. ప్రభుత్వం అందించే ప్రయోజనాలను పొందేందుకు నగరంలోని మహిళలు, మహిళా స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం పొందాలని సూచించారు. అందరి సహకారంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నామని అన్నారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ పేదలకు, అల్పాదాయ వర్గాలకు ఇందిరమ్మ క్యాంటీన్లు ఎంతో ప్రయోజనకరమన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో త్వరలో 150 ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభించబోతున్నామని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ స్వయం సహాయక సంఘాలకు క్యాంటీన్లు కేటాయిస్తామని చెప్పారు. మింట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ అందరికీ చేరువగా ఉందని ఎంపి అనిల్ కుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఇందిరమ్మ క్యాంటీన్‌ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, జోనల్ కమిషనర్లు బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు, అనురాగ్ జయంతి, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, పంకజ, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# నేను ఎక్కడున్నా ప్రజారవాణా వ్యవస్థకు మద్దతు

- నాకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు
- విసి సజ్జనార్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఆర్‌టిసికి పరిమిత కాలంలో అపరిమిత పేరు ప్రతిష్ఠలు దక్కడంలో మనమంతా చేయి చేయి కలిపి పనిచేశాం. భవిష్యత్‌లోనూ మీరంతా ఇలానే పనిచేస్తూ దేశంలోనే అత్యున్నత రవాణా సంస్థగా.. మన టిజిఎస్‌ఆర్‌టిసిని నిలబెడతారని ఆశిస్తున్నాను. ఆర్‌టిసితో నాలుగేళ్ల ఈ పయనం తనకెంతో సంతృప్తినిచ్చింది.. భవిష్యత్‌లో నేను ఎక్కడ ఉన్నా ప్రజా రవాణా వ్యవస్థకు, ఈ గొప్ప సంస్థకు నా మద్దతు కొనసాగుతుంది. ప్రజలకు రవాణా సేవలందించే ఈ గొప్ప సంస్థలో వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నాకు అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు'అని అదనపు డిజిపి, టిజిఎస్‌ఆర్‌టిసి మాజీ ఎమ్‌డి విసి సజ్జనార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిజిఎస్‌ఆర్‌టిసి అధికారులు, ఉద్యోగులందరికీ ధన్యవాదాలు ప్రకటించారు. తాను 2021, సెప్టెంబర్ మూడో తేదీన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆర్‌టిసికి వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించానని గుర్తు చేశారు. అందరి సహాయ సహకారాల వల్ల నాలుగేండ్లకు పైగా ఈ బాధ్యతల్లో కొనసాగానని తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించే నాటికి సంస్థ చాలా కష్టకాలంలో ఉందని పేర్కొన్నారు. ఆ సమయంలో ఆర్థిక లోటుతో సంస్థ మనుగడ ఉంటుందా? లేదా? అనే భయం అందరిలోనూ గూడుకట్టుకుని ఉందని తెలిపారు. అందరి అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మేథోమథన సదస్సులను జరిపి ప్రతి ఉద్యోగినీ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములను చేశామని పేర్కొన్నారు. అందరి మద్దతుతో సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చామని వివరించారు. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను తెచ్చి ఏడాదికి రూ.తొమ్మిది వేల కోట్లకుపైగా రాబడి సాధించామని తెలిపారు. ప్రతినెల ఒకటో తేదీన జీతాలిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా 2017కు సంబంధించిన 21 శాం ఫిట్‌మెంట్‌ను ఉద్యోగులకు ఇచ్చామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను దశల వారీగా చెల్లించామని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా రోజుకు సగటున 35 మంది మహిళలు ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగ సంస్థల సహకారంతో ఆర్‌టిసిని తిరిగి తన కాళ్లపై తాను నిలబడేలా కృషి చేశామని తెలిపారు.

**ఆర్‌టిసి బస్సులో సజ్జనార్ ప్రయాణం**

టిజిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డిగా తన చివరిరోజున విసి సజ్జనార్ ప్రజారవాణాపై అనుబంధాన్ని వ్యక్తం చేశారు. ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా లక్డికాపూల్-టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్‌భవన్ వరకు 113ఐ/ఎం రూట్ బస్సులో ప్రయాణించారు. యుపిఐ పేమెంట్ ద్వారా కండక్టర్ వద్ద టికెట్ తీసుకున్నారు. అనంతరం ప్రయాణికులతో ఆయన ముచ్చటించారు.

**ఆర్‌టిసి ఎమ్‌డిగా నాగిరెడ్డి బాధ్యతల స్వీకరణ**

టిజిఎస్‌ఆర్‌టిసి నూతన వైస్ చైర్మెన్, ఎమ్‌డిగా వై.నాగిరెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. బస్ భవన్‌లోని ఎమ్‌డి ఛాంబర్‌లో మాజీ ఎమ్‌డి విసి సజ్జనార్ నుంచి ఆయన బాధ్యతలను తీసుకున్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O. S. No: 211/2020
I. A. No: 103/2023
చిరుకూరి ఆదిలక్ష్మి ...వాది
మరియు
ఉప్పలపాటి రామయ్య ...ప్రతివాది
To.
తమ్మవరపు శ్రీనివాసులు, S/o. వెంకటేశ్వర్లు
R/o: D. No: 2-3-25 Co. Op Bank Coleny
Nogole, L. B Nager Hyderabad city,
Telangana State.
పై నంబరు దావాలోని I.A లో మీకు ఎన్ని సార్లు సమన్లు పంపిన ను తీసుకొనక కాలయాపన చేయు చున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు మేరకు తేది 23.10.2025న ఉదయం 10.30 ని:ల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో దావా ని మీకు పరోక్షంగా మీకు పరోక్షంగా తీర్మానించబడును.
// శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో //
మోతుకూరి సుభాష్ బాబు
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్ అద్దంకి

# స్కూళ్లలో మత్తు చేరకుండా 'ప్రహరీ'

- సత్ఫలితాలిస్తున్న ప్రహరీ క్లబ్‌లు
- విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ భాగస్వామ్యం
- గంజాయి, ఇతర మత్తు పదార్థాలు స్కూళ్లలోకి రాకుండా అడ్డుకట్ట
- బాధిత విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు ప్రభుత్వం 'ప్రహరీ క్లబ్స్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలల్లో ఈ ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయగా సత్ఫలితం వస్తోంది. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయగా.. ఇవి ముఖ్యంగా స్కూళ్లలోకి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాకుండా అడ్డుకట్ట వేస్తాయి. అయితే ఫలితాలు కొంతమేర కనిపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం మరింత నిఘా పెంచి.. పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత విద్యాశాఖ, ఇతర విభాగాలపై ఉంది. హైదరాబాద్ నగరంలోని పలు మండలాల్లో ప్రయివేట్, ప్రభుత్వ స్కూళ్లలో ఇప్పటివరకు 20కి పైగా కేసులు నిఘాకు చిక్కగా.. సదరు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ద్వారా వారికి అవగాహన కల్పించి చర్యలు తీసుకుంటున్నారు. అయితే నిఘా దొరకని కేసులు పెద్ద సంఖ్యలో ఉంటున్నాయని పలువురు విద్యారంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

జిల్లాలో 2,262 ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 4 లక్షలకుపైనే ఉంటారు. వీరికి ఇప్పటికే మత్తుపదార్థాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా పాఠశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ వినియోగించకుండా చూడటం, వాటిని వినియోగించేవారిని గుర్తించి అవగాహన కల్పించడం, పాఠశాలల చుట్టుపక్కల ఎవరూ విక్రయించకుండా, పాఠశాలల్లోకి చేరకుండా, విద్యార్థులు చిక్కుకోకుండా క్లబ్‌లు చర్యలు చేపడుతున్నాయి. మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడంతో పాటు నిఘా పెడుతున్నారు. ఈ ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు, వాటి పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక కో-ఆర్డినేటర్ కూడా పని చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రహరీక్లబ్ పనితీరును పరిశీలిస్తారు. అయితే విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయాలని ఇప్పటికే పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయగా కమిటీల ఏర్పాటు ప్రక్రియ చాలా ప్రభుత్వ స్కూళ్లలో బాగుండగా.. అసలు ప్రయివేట్ స్కూళ్లలో ఎంతమంది క్లబ్స్ ఏర్పాటు చేశారో లేదో.. తెలియదు.

**పలు మండలాల్లో కేసులు..**

గతేడాది స్కూళ్లలో ఏర్పాటుచేసిన ప్రహరీ క్లబ్‌ల ద్వారా మత్తుపదార్థాలకు గురవుతున్న విద్యార్థులను గుర్తిస్తున్నారు. ఉదాహరణకు నాంపల్లి మండలంలోని ఓ స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి ఒకరిద్దరు తొమ్మిదో తరగతి విద్యార్థులపై అనుమానం వచ్చి బ్యాగ్ చెక్ చేయగా.. ఈ-సిగరెట్లు దొరికాయి. ఖైరతాబాద్ మండలంలో మరో ప్రముఖ స్కూల్లో విద్యార్థులు గంజాయి తీసుకున్నట్టు గుర్తించిన ఉపాధ్యాయులు.. ఆ విషయాన్ని బయటకు పొక్కకుండా.. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. సైదాబాద్‌లోని ఓ స్కూల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు బలపాలు తినే అలవాటుంది. వారు పాఠశాల దగ్గరల్లోని ఓషాపులో బలపాల బాక్స్ కొని వాటిని తిన్నారు. ఆ బలపాలు తిన్న ఇద్దరు పిల్లలు ఆస్పత్రి పాలయ్యారు. ఈ విషయాన్ని స్కూల్ హెడ్‌మాస్టారు ప్రహరీ క్లబ్స్ టీమ్‌కు తెలియజేయగా.. వారు చేసిన ఎంక్వైయిరీలో పలు విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయి. ఈ ఇద్దరు పిల్లలు తిన్న బలపాలు రాజస్తాన్, అస్సాంలో తయారైనట్టు గుర్తించి.. వీటిల్లో డ్రగ్స్ వినియోగం ఉన్నట్టు తేల్చారు. దాంతో ఆ ప్రాంతాల్లో నార్కోటిక్స్ బ్యూరో నిఘా ఉంచింది. పాతబస్తీల్లోని కొన్ని ప్రాంతాల్లో డ్రగ్స్ అమ్ముతున్నట్టు దొరికాయి. ముఖ్యంగా పిల్లలను బానిసలు చేసేందుకు స్మైలీ స్టిక్కర్స్ పేరిట వారిని వాటికి బానిసలను చేస్తున్నారు. వీటిల్లో మత్తు పదార్థాలు ఉన్నట్టు గుర్తించారు. వైటనర్స్‌లోనూ మత్తు ఉండగా.. హెచ్‌పిఎస్ సిగార్స్, కొకైన్ వైట్ ప్యాకెట్స్, పౌడర్స్, ఇతర డ్రగ్స్ విక్రయిస్తున్నారు. పాతబస్తీల్లోని కొన్ని ప్రాంతాలు, బండ్లగూడ సరిహద్దుల్లో డ్రగ్స్ దొరికినట్టు బృంద సభ్యులు ఒకరు తెలిపారు. ఇవేకాక నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బేగంపేటతో పాటు పలు మండలాల్లో 20కిపైగా కేసులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిని పర్యవేక్షిస్తున్నారు. ఇదంతా పక్కనున్న విద్యార్థులకు ఎలాంటి అనుమానం రాకుండా అవగాహన కల్పిస్తున్నారు. ప్రహరీ క్లబ్స్ ఏర్పాటుతో జిల్లాలో కొంతమేర తగ్గినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోరకంగా ఉంది.

**కమిటీ సభ్యులు ఇలా..**

జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌కు ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా, సీనియర్ ఉపాధ్యాయుడు ఉపాధ్యక్షుడిగా, చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్, ఎస్‌హెచ్‌జి సభ్యులుగా ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రతి తరగతికి ఇద్దరు సభ్యులుగా ఉంటారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఒకరు, సమీపంలోని పోలీస్‌స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌ను సభ్యులుగా ఉంటారు. పాఠశాలలకు దగ్గరలో మత్తుపదార్థాల వినియోగం, విక్రయం వంటివి జరిగితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందిస్తారు. ఎవరైనా విద్యార్థులు మత్తుపదార్థాల బారిన పడినట్టు వారి దృష్టికి వస్తే కౌన్సెలింగ్ కూడా ఇస్తారు. ఈ కమిటీల్లోని సభ్యులు, పాఠశాలల్లోని విద్యార్థులకు 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడంపై అవగాహన కల్పిస్తారు.

**తల్లిదండ్రులదే బాధ్యత: ఆర్.రోహిణి, డిఇఒ, హైదరాబాద్**

పాఠశాలల సమయంలో విద్యార్థులపై పూర్తి నిఘా ఉంచుతాం. వారి ప్రవర్తన ఎలా ఉంటుందో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తాం. పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వెళ్లాక.. వారు ఏం చేస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారు అనేది తల్లిదండ్రులే చూసుకోవాలి.

## భారీవర్షాలకు దెబ్బతిన్నరోడ్ల పునరుద్ధరణ

- ఆర్అండ్‌బి శాఖపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న ఆర్అండ్‌బి రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని పురోగతిపై సోమవారం నాడు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో మరమ్మతుకు గురైన రోడ్ల వివరాలపై మంత్రి ఆరా తీశారు. రాష్ట్రంలోని 1062 ప్రాంతాల్లో 1370 కి.మీ మేర రోడ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. 68 రోడ్లు కోతకు గురికాగా, 38 తాత్కాలిక పునరుద్ధరణ చేసినట్టు ఇఎన్‌సి మోహన్‌నాయక్ వివరించారు. వర్షపు నీరు ఓవర్ ఫ్లో ఉన్న 520 రోడ్లకు గాను 478 చోట్ల తగ్గుముఖం పట్టాయన్నారు. 445 చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే,375 చోట్ల పునరుద్ధరణ చేసినట్టు తెలిపారు. సుమారు 306 కోట్ల సిడి పనులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణ కోసం అంచనాలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం తాత్కాలిక పునరుద్ధరణ కోసం రూ. 72.49 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.1263.33 కోట్లు అవుతాయని అధికారులు వివరించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పూర్తి స్థాయి, తాత్కాలిక మరమ్మతులు చేపడతామని చెప్పారు. శాశ్వత పునరుద్ధరణ కోసం మళ్లీ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని ఆర్ అండ్ బి ఇఎన్‌సి మోహన్‌నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

టిమ్స్ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలు, ఇంటిగ్రేటెడ్ జిల్లా కలెక్టరేట్ల పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. టిమ్స్ హాస్పిటళ్లు, మెడికల్ కాలేజీల పనులు వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఇఎన్‌సి మోహన్‌నాయక్, సీఈలు రాజేశ్వర్‌రెడ్డి, బివి రావు, లక్ష్మణ్, ఎం శ్రీనివాస్ రెడ్డి, కిషన్‌రావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు వెంకటేష్, తదితరులు

## వరదలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

అధిక వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. అధిక వర్షాలు, వరదలతో ఇటీవల నిజామాబాద్ జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటంతా నీటమునిగి.. ఇసుక మేటలు వేసిందని అన్నారు. రైతులు పెట్టుబడి పెట్టి నెల రోజుల్లో చేతికి వచ్చే సమయానికి పంటంతా నష్టపోయి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వరి, మొక్కజొన్న, సోయా, పత్తి, కూరగాయలు అధిక వర్షాల వల్ల నీట మునిగి రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నీ రకాల పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మక్కలు కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి నల్లగా రంగు మారాయని, దాంతో తక్కువ ధరకు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షకాలం వరి పంట కోతకు వచ్చిందని.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వడ్లను వెంటనే రైస్ మిల్లుకు తరలించి రైతులకు నష్టం రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తొగటి భూమన్న, సిఐటియు మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య, రైతులు శేపూర్ సాయన్న, ఆలకుంట సాయిలు, చిన్నయ్య, ఎల్లయ్య, గుండేటి శంకర్, ఓంకార్, గంగారం, విడగొట్టి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబరాలు చేసుకుంటున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ వేడుకలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, సరూర్‌నగర్ పరిసరాలు వెలుగులీనుతున్నాయి. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. హనుమకొండ, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల్లో మహిళలంతా సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

## దసరా రద్దీ... బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

దసరా పండగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. నగరవాసులు కుటుంబ సమేతంగా పల్లెలకు బయలుదేరి వెళ్తున్నారు. దీంతో జూబ్లీ బస్టాండ్ (జెబిఎస్), ఎంజిబిఎస్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. పండుగ వేళ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. పండగ నేపథ్యంలో మరికొన్ని రోజులు ఈ రద్దీ కొనసాగే పరిస్థితులున్నాయి. మరోవైపు ప్రైవేటు, సొంత వాహనాల్లోనూ పెద్దఎత్తున గ్రామాలకు వెళు తున్నారు. దీంతో నగరంలోని చాలా ప్రాంతాలు కళ తప్పాయి. వరంగల్, విజయవాద హైవేలపై టోల్ గేట్ల వద్ద రద్దీ కొనసాగుతోంది.

## బాసరలో గోదావరి ఉగ్రరూపం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. బాసరలో గోదావరి నది పోటెత్తింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. బాసర శ్రీసరస్వతి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టింది. సోమవారం పుష్కరఘాట్‌ల వద్ద పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు.

# జర్నలిస్టులకు ప్రజాప్రభుత్వం అండ

- మంత్రి సీతక్క

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారంనాడు హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీడియా రంగంలో వృత్తిని కొనసాగిస్తూ అమరులైన జర్నలిస్టులకు జోహర్లు అర్పించారు. సమాజంలోనిజర్నలిస్టులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తారన్నారు. అలాగే ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారని అన్నారు. జర్నలిస్టులంతా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని మిగతా సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ మీడియా అకాడమి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించడం వలన ఆయా కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని గుర్తుచేశారు. ఇదిలావుండగా జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడానికి శిక్షణా కార్యక్రమాలు సైతం మీడియా అకాడమీ చేపడుతోందన్నారు. దీంతో విలేకరులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో ఇండ్లు లేని జర్నలిస్టులకు ఇళ్లను కేటాయించాలని, మరణించిన కుటుంబాలకు హెల్త్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్టు చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మరణించిన 18 మంది వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసినట్టు చెప్పారు. ఐదేళ్ల పాటు పెన్షన్ సైతం ఇచ్చినట్టు తెలిపారు. ప్రమాదాలతో దీర్ఘకాలికంగా అనారోగ్యం బారిన పడిన ఆరుగురు వర్కింగ్ జర్నలిస్టులకు రూ. లక్ష, తీవ్ర గాయాలైన ఒక్కో జర్నలిస్టుకు రూ. 50 వేలు మొత్తం రూ.24.50 లక్షల మేర ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేయడం జరిగింది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు.

సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ మీడియా అకాడమి భవనం బహుళ అంతస్తులలో కొనసాగుతున్నందున అందులో శిక్షణ కొరకు ఆడిటోరియం ఉండడంతో జర్నలిస్టులకు ఎఐ., సోషల్ మీడియా, భాషపై పట్టు కోసం నిరంతరం జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆమె వివరించారు. అలాగే జర్నలిస్టుల సౌకర్యార్థం కంప్యూటర్ ల్యాబ్, లైబ్రేరి ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి సూచన మేరకు క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పౌర సంబంధాల అధికారులకు మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు

- కేసులను వెనక్కి తీసుకోవాలి
- అంగన్‌వాడీలకే ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీ విద్య కేటాయించాలి : జయలక్ష్మి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

అంగన్‌వాడీ హక్కుల కోసం ఉద్యమిస్తుంటే అక్రమంగా అరెస్టు చేసి, కేసులు బనాయించడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీ విద్య అంగన్‌వాడీలకే కేటాయించాలని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో మంత్రుల ఇండ్ల ముట్టడి పిలుపులో భాగంగా సిఎం ఇంటిని ముట్టడిం చామన్నారు. పోలీసులు మధ్యలోనే అడ్డుకొని మహిళలని కూడా చూడకుండా మగ పోలీసులు ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి చట్టాన్ని తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరించి తమపై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో పాటు సిఐటియు వికారాబాద్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, నాయకులు నర్సమ్మ, సిఐటియు నారాయణపేట జిల్లా కార్యదర్శి బలరాంపై కేసులు నమోదు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ఒకవైపు బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తూనే.. మహిళలను పండగ జరుపుకోకుండా కేసులు చుట్టూ తిప్పడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. సిఎం జోక్యం చేసుకుని వెంటనే తమపై పెట్టిన కేసులను కొట్టివేయాలని కోరారు. ప్రీ ప్రైమరీ పిఎం శ్రీ విద్య అంగన్‌వాడీలకే కేటాయించాలని, ప్రభుత్వం ముందు పెట్టిన 18 డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానం మారకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, నాయకులు నర్సమ్మ, నారాయణపేట జిల్లా కార్యదర్శి బలరాం తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న జయలక్ష్మి

## ప్రజల ఆత్మగౌరవాన్ని చాటే పండుగ

- కెటిఆర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ప్రజల ఆత్మగౌరవాన్ని చాటే పండుగ బతుకమ్మ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలు, ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూలను పూజించి ప్రకృతిని ఆరాధించి గౌరమ్మను భక్తితో కొలిచే సబ్బండ వర్ణాల సంబురం బతుకమ్మ అని పేర్కొన్నారు. ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని తెలిపారు. పువ్వులను దేవతగా పూజించే ఈ ఉత్సవం తెలంగాణ సంస్కృతి అస్తిత్వం, ప్రకృతితో ప్రజలకున్న అనుబంధానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. ప్రపంచానికి తెలంగాణ విశిష్టతను, సంస్కృతిని చాటిచెప్పే గొప్ప పండుగ ఇదేనని వివరించారు.

## విత్తన ఎగుమతులు, దిగుమతులపై పరస్పర సహకారం

- జపాన్ ప్రతినిధులతో చిన్నారెడ్డి భేటీ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

విత్తన ఎగుమతులు, దిగుమతులపై పరస్పరం సహకరించుకునేందుకు జపాన్, తెలంగాణ ప్రతినిధులు సమావేశమయ్యారు. తెలంగాణ విత్తన రంగ అభివృద్ధి, ఎగుమతులకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసేందుకు జపాన్, ఇండియా సహకార ఆర్గనైజేషన్ చైర్మెన్ కెంజీ ఒకుమూర, వైస్ చైర్మెన్ జూన్ ఓయబు రాష్ట్రాన్ని సందర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి జపాన్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో నాణ్యమైన విత్తనోత్పత్తికి ఉన్న అవకాశాలు, మెరుగైన మౌలిక వసతులు, తెలంగాణ విత్తన పరిశ్రమ సామర్థ్యం, పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు వివరించారు. గ్లోబల్ సీడ్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న విధాన పరమైన అంశాలను జపాన్ ప్రతినిధులు ప్రశంశించారు. సమావేశంలో వింగింగ్ గ్లోబల్ సర్వీస్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఎస్.రవీనాథ్ రెడ్డి, జపాన్ సలహాదారు, ఆర్టిస్ట్ నరేందర్ రెడ్డి, రిటైర్ట్ ఐఎఎస్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలు దుర్మార్గం

- మావోయిస్టులతో కేంద్రం చర్యలు జరపాలి : చాడ డిమాండ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదనీ, వారిని అంతం చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలతో దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? అనే అనుమానం కలుగుతోందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాలు లేని సమాజం కావాలని, సంపద అందరికీ చెందాలని మావోయిస్టులు, కమ్యూనిస్టులు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా అంబాని, అదానిలు రూ.లక్షల కోట్లకు పరిగెడుతున్నారనీ, ఇంకోవైపు తిండిలేక భిక్షాటన చేస్తున్న ప్రజలూ ఉన్నారని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక అంతరాలు మరింత పెరిగాయని వివరించారు. చర్చలు జరిపి మావోయిస్టుల సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి : జాక్టో

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో జాక్టో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జాక్టో చైర్మన్ జి సదానందంగౌడ్, సెక్రెటరీ జనరల్ కె కృష్ణుడు, కోశాధికారి జి హేమచంద్రుడు, కో చైర్మన్ జి రాములు, నాయకులు బిఎన్ యాదవ్, అంజయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీం కోర్టు ద్వారా ఇన్ సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునిచ్చేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. విద్యాహక్కు చట్టం అమలైన 2010 కంటే ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని తెలిపారు. పాఠశాల విద్యలో అన్ని కేటగిరీల్లో మిగిలిపోయిన పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఎలాంటి షరతుల్లేకుండా భాషాపండితులు, పిఇటిలను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖలో అకారణంగా నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు నాణ్యమైన ఆరోగ్య కార్డులను జారీ చేయాలని కోరారు. సర్వీస్ నిబంధనలను రూపొందించి ఎంఇఒ, డిప్యూటీఇఒ, డైట్, బిఇడి, జూనియర్ లెక్చరర్ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని తెలిపారు.

## బిసిఐ ఎన్నికల సంస్కరణలకు 'ఐలు' ఖండన

- నామినేషన్ ఫీజు వాపస్‌కు డిమాండ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) ఇటీవల జారీ చేసిన సర్క్యులర్‌ను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దీని ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.1,25,000 నాన్-రీఫండ్ నామినేషన్ ఫీజు చెల్లించాలనే నిబంధన ఎంతమాత్రం సరికాదని వ్యాఖ్యానించింది. ఈ నిర్ణయం ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా, న్యాయబద్ధంగా లేదని విమర్శించింది. పారదర్శకత యొక్క ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించడమేనని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి విమర్శించారు. ప్రతి అభ్యర్థికి రూ.1,25,000 వరకు తిరిగి చెల్లించలేని రుసుము విధించడం ప్రజాస్వామ్య ప్రక్రియకే విరుద్ధమని చెప్పారు. ఏదైనా చట్టపరమైన సంస్థలో ఎన్నికలు ఆర్థిక సామర్థ్యాల ఆధారంగా కాకుండా యోగ్యత ఆధారంగా జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ రుసుమును తిరిగి చెల్లించ కూడదనే నిర్ణయం, సమస్యను మరింత తీవ్రతరం చేస్తుందన్నారు. ఎన్నికల ఫలితంతో సంబంధం లేకుండా అభ్యర్థులు ఆర్థిక నష్టాలకు గురవుతారని వివరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం మొత్తం ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను సైతం ప్రశ్నిస్తున్నట్టు చెప్పారు. ఇవి అందరు న్యాయ నిపుణులకు న్యాయమైన, సమాన అవకాశాన్ని కల్పించడం కంటే ఆదాయంపై ఎక్కువ దృష్టి సారించినట్టు అనిపిస్తుందన్నారు. ఇది ఎన్నికల ప్రక్రియను నియంత్రించాల్సిన ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘించడమేనని అభిప్రాయపడ్డారు. భారత బార్ కౌన్సిల్ పునఃపరిశీలించి గతం మాదిరిగానే నామినేషన్ ఫీజు మొత్తాన్ని వసూలు చేయాలని, రాష్ట్ర బార్ కౌన్సిళ్లల్లో ఎన్నికలు నిర్వహించడానికి మరింత ప్రజాస్వామ్య విధానాన్ని అవలంబించాలని సూచించారు. ఈ ప్రక్రియ అందరినీ కలుపుకుని సరళమైనదిగా, న్యాయమైన ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మాతృవియోగం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఎమ్మెల్యే మాతృమూర్తి లక్ష్మీ నర్సమ్మ (93) కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. కాగా సోమవారం మధ్యాహ్నం పరిస్థితి విషమించి కన్నుమూశారు. మంగళవారం కంఠేశ్వర్ బైపాస్‌లోని అశోక టౌన్‌షిప్‌లోని ఎమ్మెల్యే నివాసం నుంచి అంతమయాత్ర ప్రారంభమై.. గూపన్‌పల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

## సామాజిక వివక్షతపై పోరాడిన భాగ్య రెడ్డి వర్మ

- సిపిఎం నాయకులు నంద్యాల నరసింహా రెడ్డి

**ప్రజాశక్తి కల్చరల్**

అంబేద్కర్ కన్నా ముందే దళితులపై జరుగుతున్న సామాజిక వివక్షత పై పోరాడిన భాగ్య రెడ్డి వర్మ బడుగు బలహీల వర్గాల ఆశా జ్యోతి అని సిపిఎం నాయకులు నంద్యాల నరసింహా రెడ్డి అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా భాగ్య రెడ్డి వర్మ యాది లో సంస్కరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న నంద్యాల నరసింహా రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన భాగయ్య తదుపరి కాలం లో రెడ్డి గా పేరు మార్పు చేసుకున్నారు అని చెప్పారు దళితులను ఏకత్రాటి పైకి తీసుకుని వచ్చేందుకు అది హిందూ గా గుర్తించాలనీ ఉద్యమించారు అని వివరించారు విద్య మాత్రమే దళితులను ఉన్నత స్థాయికి తీసుకు వెడుతుందనీ చాదర్ఘాట్ వద్ద అది హిందూ కేంద్రం నుంచి 26 ప్రాథమిక పాఠశాల లు ఆరంభించి దళిత పిల్లలను చదువు పై ఆసక్తి కల్పించారు అని నరసింహా రెడ్డి తెలిపారు సమాజం లో వున్న అంధ విశ్వాసాలు వ్యతిరేకం గా బాల్య వివాహాలు రద్దు పై పోరాటం వితంతువుల పునర్వివాహం ను ప్రచారం చేశారు అన్నారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ,సంఘ సేవకుడు నైషధం సత్యనారాయణ గాయని అన్నపూర్ణ పాల్గొన్నారు